సాక్షి
వనపర్తి
శుక్రవారం । 9 । జూన్ । 2023



గ్రేడ్-1 మున్సిపాలిటీగా జడ్చర్ల
జడ్చర్ల మున్సిపాలిటీ గ్రేడ్-1గా మారనుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.
వివరాలు 10లో ▸



గుప్తనిధుల ముఠా గుట్టురట్టు
చోరీకి గురైన శివలింగంతోపాటు గుప్తనిధుల ముఠాను పోలీసులు పట్టుకున్నారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.4 /23.7
ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పద్మ అవార్డులకు ఆహ్వానం

వనపర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం వచ్చే గణతంత్ర దినోత్సవం రోజు ఇచ్చే జాతీయ పద్మ పురస్కార్కాలకు ఆయా రంగాల్లో విశిష్ట సేవలందించిన వారు ఆన్‌లైన్ ద్వారా 800 పదాలు మించకుండా దరఖాస్తు చేసుకోవాలని మహిళా, శిశు, వయో వృద్ధుల జిల్లా సంక్షేమ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, విద్య, సాహిత్యం, ఆటలు, క్రీడలు, వైద్యం, సామాజిక సేవలు, సాంకేతిక, సాంఘిక సేవలు, వాణిజ్యపరమైన వృత్తులో విశిష్ట సేవలు అందించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 15వ, తేదీలోగా http://padmaawards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాల పంపిణీ వాయిదా

వనపర్తి టౌన్: వనపర్తి పట్టణంలో నివసిస్తున్న పేదలకు లక్కీ డిప్‌ద్వారా ఎంపిక చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ప్రక్రియ వాయిదా వేసినట్లు తహసీల్దార్ రాజేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం పట్టాల పంపిణీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా వేశామని, రెండు మూడు రోజుల్లోనే పట్టాల పంపిణీకి సంబంధించిన తేదీలను ఖరారు చేసి ప్రకటిస్తామని తెలిపారు. ఈ విషయన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు గమనించాలని కోరారు.

ఒంటికాలిపై నిలబడి నిరసన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,335 మంది ఒప్పంద అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించాలని పీయూ పుటా అధ్యక్షుడు డా.వి.భూమయ్య డిమాండ్ చేశారు. తమ ఆందోళనలో భాగంగా గురువారం పీయూలో ఒంటికాలిపై ఎర్రటి ఎండలో కొద్దిసేపు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు రాష్ట్ర మహా సదస్సుకు సంబంధించిన 'చలో ఉస్మానియా' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేసేవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, ఒప్పంద అధ్యాపకులు డా.ఎస్ఎన్అర్జున్‌కుమార్, డా.విజయభాస్కర్, గాలెన్న, మాధురి, శ్రీలత, కల్పన, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బంది ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని కోరుతూ సంఘం సభ్యులు గురువారం కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పీయూలో పని చేస్తున్నా ఉద్యోగభద్రత లేదని, వెంటనే రెగ్యులర్ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రామ్మోహన్ బుర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలకు చెక్

జిల్లాలో త్వరలో అందుబాటులోకి రానున్న 15 కొత్త సబ్‌స్టేషన్లు



పెద్దమందడిలో పూర్తికావచ్చిన సబ్ స్టేషన్

- దశబ్దాలుగా వేధిస్తున్న అదనపు సబ్‌స్టేషన్ల కొరత
- ఒక్కో సబ్ స్టేషన్‌తో నాలుగు ఫీడర్లు పెరిగే అవకాశం
- అందనున్న నాణ్యమైన విద్యుత్

వనపర్తి టౌన్: ఏళ్ల కిందట నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్లతోనే నేటికి విద్యుత్ సేవలు అందుతున్నాయి. అయితే, అటు పట్టణాలు, ఇటు పల్లెలు విస్తరిస్తుండం.. కొత్త కాలనీలు ఏర్పడడంతో ఆయా ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్యలు తీవ్రమయ్యాయి. ప్రధానంగా వర్షాకాలంలో విద్యుత్ బల్బులు, టీవీలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయిన సంఘటనలు అనేకంగా ఉన్నాయి. వీటితోపాటు లక్ష్యానికి మించి రైతులు పంటలు సాగు చేస్తుండడంతో ప్రస్తుత సబ్‌స్టేషన్లపై భారం పెరిగింది. ఇన్నేళ్లకు విద్యుత్ సమస్యలకు చెక్ పెడుతూ.. కొత్త సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. ఇవి పూర్తయితే నాణ్యమైన విద్యుత్ అందనుంది..

60 సబ్‌స్టేషన్లు .. 256 ఫీడర్లు

జిల్లాలో 60 సబ్ స్టేషన్లతో సుమారు 256 ఫీడర్లతో విద్యుత్ అందుతున్నప్పటికీ ఫీడర్ల సంఖ్య పెరగకపోవడంతో విద్యుత్ వినియోగం భారమైంది. జిల్లాలో గృహ, పరిశ్రమలు, రైతులు ఇతర కనెక్షన్లు కలిపి 2లక్షల 50 వేల వరకు ఉన్నాయి. తాజాజా జిల్లాలో ఫీడర్ల స్థాయి పెంచేందుకు కొత్తగా 15 సబ్ స్టేషన్‌లు అవసరమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు మంజూరు చేసింది. ఒక్కో దానికి రూ.2 కోట్లు నిధులు విడుదల చేసింది. జిల్లాకు నలువైపులా 11/33 కేవీ సబ్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో సబ్ స్టేషన్‌కు అదనంగా నాలుగు ఫీడర్లు రానుండటంతో ప్రస్తుత విద్యుత్ సరఫరాపై భారం తగ్గనుంది. కొత్త సబ్ స్టేషన్‌లు అందుబాటులోకి వస్తే అదనంగా 60 ఫీడర్లు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలోని దాదాపు అన్ని మండలాలకు సబ్ స్టేషన్‌లు మంజూరై, అగ్రిమెంట్లు పూర్తయి కొన్ని నెలలు కావస్తున్నా కొన్ని చోట్ల పనుల పురోగతి ఏ మాత్రం కనిపించడం లేదు. 15 సబ్‌స్టేషన్ల నిర్మాణంలో కేవలం ఒకే ఒక్క సబ్‌స్టేషన్ నిర్మాణం ఇప్పటి వరకు పూర్తి కాగా, 12 సబ్ స్టేషన్‌లు వివిధ స్థాయిలో నిర్మాణపు దశలో ఉన్నాయి. ఎప్పటివరకు పూర్తి అవుతాయో స్పష్టత కొరవడింది. మిగతా రెండు చోట్ల సబ్ స్టేషన్ల నిర్మాణానికి స్థల సేకరణ ఎంపిక ప్రక్రియనే సమస్యగా మారింది.

జిల్లా వివరాలిలా..	
ప్రస్తుత సబ్‌స్టేషన్లు	60
కొనసాగుతున్న ఫీడర్లు సుమారుగా	256
కొత్త సబ్ స్టేషన్లు	15
నిర్మాణంలో ఉన్నవి	12
పూర్తియినవి	1
స్థల సేకరణలో జాప్యం	2
జిల్లాలో మొత్తం కనెక్షన్లు	2.50లక్షలు

మూడు నెలల్లో పూర్తి చేస్తాం



జిల్లాలోని అన్ని సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు మూడు నెలల్లో పూర్తి చేస్తాం. అదనపు సబ్ స్టేషన్లతో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు తగ్గుతాయి. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది.

– పీవీ నాగేంద్రకుమార్, ఎస్ఈ, ట్రాన్స్‌కో, వనపర్తి

ఫీడర్లపై తగ్గనున్న భారం

ఇప్పుడున్న ఫీడర్లపై అధిక భారం పడే అవకాశం ఉండదు. ఫలితంగా విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి చింత ఉండదు. అదనపు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే లోఓల్టేజీ సమస్యను కొంత మేర అధిగమించవచ్చు. ఒక్కొక్క సబ్ స్టేషన్ రూ. 2 కోట్ల మంజూరు చేసింది. టెండర్, అగ్రిమెంట్ పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు.

వివిధ దశల్లో నిర్మాణ పనులు..

జిల్లాలోని 15 సబ్ స్టేషన్‌లలో ఒక సబ్ స్టేషన్ పని పూర్తిగా, 12 సబ్ స్టేషన్‌లో పనులు నిర్మాణపు పనులు వివిధ దశలో ఉన్నాయి, రెండింటికి స్థల సేకరణలో జాప్యం కారణంగా ముందడుగు పడటం లేదు. కొత్తకోట మండలంలోని ఆమడబాకులలో సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు పూర్తికాగా, కొత్తకోట పట్టణంలోని పామాపురం, పెబ్బేర్ మండలంలోని తోమాలపల్లి, గుమ్మడం, ఘనపూర్ మండలంలోని మానాజీపేట, ఆత్మకూర్‌లోని బాలకిష్టపూర్, పెద్దకాలువ జూరాల, వనపర్తి పట్టణంలోని ఆర్డీఓ ఆఫీస్, వనపర్తి మండలంలోని ఆచ్యుతాపూర్, పెద్దమందడి మండలంలోని అమ్మాయిపల్లి– మదిగట్ల, గోపాల్‌పేటలోని ఏదుట్ల, తల్పునూర్, మదనాపురంలోని కొన్నూర్‌లో నిర్మాణంలో ఉండగా, స్థల సేకరణలో జాప్యంతో వీపనగండ్ల మండంలోని తూముకుంట ఎక్స్‌రోడ్డు, వనపర్తి మండలంలోని చిన్నగుంటపల్లి సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ఇంకా మొదలు కాలేదు. అదే విధంగా మిషన్ భగీరథ సహకారంతో పెద్దమందడి మండలంలోని బుగ్గపల్లితండా వద్ద మరో సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి కావొచ్చింది.

సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఐఈఓ జాకీర్ హుస్సేన్

వనపర్తి టౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఊర్దూ మీడియం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసి సీఎస్, డీఎస్, కస్టోడియన్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీ నుండి 17వ, తేదీ వరకు జరగబోయే ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో 6 ప్రభుత్వ, 8 ప్రైవేట్ ఉన్నాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్స్ 14, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ 14, కస్టోడియన్స్ 3, అడిషనల్ సూపరింటెండెంట్స్ 8, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 01, సిట్టింగ్ స్క్వాడ్స్‌లను 01 చొప్పున నియమించామన్నారు. విద్యార్థులను ఉదయం 8గంటలకే పరీక్ష కేంద్రంలోని అనుమతిస్తామని, పరీక్ష సమయానికి మించి ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోని అనుమతించమన్నారు. ఫస్ట్ ఇయర్ జనరల్‌లో మొత్తం 3,063, ఒకేషనల్‌లో 368, మొత్తం 3,431, సెకండ్ ఇయర్ జనరల్‌లో 1,377, ఒకేషనల్‌లో 211 మంది మొత్తం 1.588 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న ఐదు ఎస్సీ గురుకుల్లాలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాంరెడ్డి గూడెం ప్రిన్సిపాల్ వాణిశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు తెలుగు 2, ఆంగ్లం 4, గణితం 2, ఫిజిక్స్ 3, కెమిస్ట్రీ 3, బాటనీ 2, జువాలజీ 3, సైకాలజీ, కామర్స్ 1, సివిక్స్ 1 సబ్జెక్టులు ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గల వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు రాంరెడ్డి గూడెం గురుకుల వద్దకు బయోడేటా, సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని సూచించారు.

వేరుశనగ క్వింటా రూ.7,372

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు గురువారం 69క్వింటాళ్ల వేరుశనగ రాగా, క్వింటాకు గరిష్ఠం రూ.7372, కనిష్ఠం రూ. 4249, సరాసరి రూ. 6,170 ధరలు లభించాయి. అలాగే, 13 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్ఠం రూ. 5312, కనిష్ఠం రూ.4860, సరాసరి రూ.5312 ధర పలికింది. 73 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్ఠం రూ. 2152, కనిష్ఠం రూ. 1812, సరాసరి రూ. 2139 ధరలు వచ్చాయి.

కుట్రలతోనే ఆలస్యం

అయినా 90 శాతం 'పాలమూరు' ఎత్తిపోతల పనులు పూర్తి చేశాం



జడ్చర్ల సభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్

- కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లతో దశాబ్దాల పీడ పోతది
- కృష్ణా జలాలతో సస్యశ్యామలంగా మారిన జిల్లా
- మండుటెండల్లోనూ చెరువులు మత్తళ్లు పారుతున్నాయ్
- సాగు, తాగునీరు ఇవ్వనోళ్లు ఓట్ల కోసం వస్తుండ్రు
- రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: పాలమూరు జిల్లా పంటలతో సస్యశ్యామలంగా మారిందని రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుట్ట వద్ద రూ.33.03 కోట్లతో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. జిల్లా పర్యటనకు హెలికాప్టర్‌లో వస్తున్న తాము కిందకు చూసినప్పుడు మండుటెండల్లోనూ జిల్లాలోని చెరువులు మత్తళ్లు దూకడం కనిపించిందన్నారు. అంతకు ముందు ఏనాడైనా ఈ పరిస్థితి ఉండేనా అని ప్రశ్నించారు. హెలీకాప్టర్‌లో వస్తుంటే ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముందుగా ఉదండాపూర్ రిజర్వాయర్, తర్వాత కర్వెన్ రిజర్వాయర్లు చూపించారని, ఇవి ఎందుకు చూపిస్తున్నావని అడిగితే.. వీటి ద్వారా తన నియోజకవర్గంలో 1.44 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, దీంతో దశాబ్దాలుగా ఉన్న పీడ పోతదని సంతోషాన్ని పంచుకున్నారన్నారు. కానీ, కాంగ్రెస్ సన్నాసుల కుట్రలతో ప్రాజెక్టు ఆలస్యమైందని, అయినా వెనకడుగు వేయకుండా వాయువేగంతో 90 శాతం మేర పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పనులు పూర్తిచేశామన్నారు. ఇది అభివృద్ధి కాదా అంటూ ప్రశ్నించారు. మరో రెండు నెలల్లో రిజర్వాయర్లకు నీళ్లు అందిస్తామని ప్రకటించారు. జడ్చర్ల నియోజకవర్గంలో 625 చెరువులు ఉంటే రూ.90 కోట్లతో 375 చెరువులు పూడికతీసి బాగుచేశామని తద్వారా రైతులకు మేలు కలగడంతోపాటు గంగపుత్రులకు ప్రయోజనం చేకూరిందన్నారు. గ్రామాల్లో సంతోషకరమైన పండగ వాతావరణం నెలకొందని, అయినా కాంగ్రెస్ సన్నాసులు మాయమాటలు చెప్పి మిమ్మల్ని ముంచేందుకు ముందుకు వస్తున్నారని వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. నాడు రాష్ట్రంలో 29 లక్షల మంది పింఛన్‌దారులుంటే నేడు 46 లక్షల మందికి అందిస్తున్నామని, ఇందుకోసం రూ.12 వేల కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. రైతు బీమా ద్వారా రూ.1,450 కోట్లు ప్రభుత్వమే చెల్లించి రైతులకు భరోసా కల్పించామని గుర్తు చేశారు. తెలంగాణ రాకముందు రాష్ట్రాన్ని ఏలినా తాగు, సాగునీరు ఇవ్వనోళ్లు ఇప్పుడు ఓట్లకోసం వస్తుంర్రుని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హ్యాట్రిక్ సీఎం కేసీఆర్

మూడోసారి బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి కోరారు. అభివృద్ధి చేస్తున్న తమకే ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. ఎంపీ ఎన్నికల అనంతరం ఢిల్లీలో ఎర్రకోటపై పీఎం హోదాలో కేసీఆర్ జెండావిష్కరణ చేస్తారని, సీఎంగా కేటీఆర్ ఉంటారని అన్నారు. ఆరు నెలలు ఆగితే తాము అధికారంలోకి వస్తామని కాంగ్రెస్, బీజేపీలు చెబుతున్నాయని.. ఎలా వస్తారని వ్యంగ్యంగా విమర్శించారు.

ఆర్నెళ్లు కాపు కాయాలె

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నారని, కాంగ్రెసోళ్ల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకునేందుకు 6 నెలలు కాపు కాయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గడిచిన తొమ్మిదేళ్లలో అభివృద్ధి కళ్లకు కట్టినట్లుగా కనపడుతున్నా ఏం చేయలేదని ప్రజల ముందుకు వస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి 75 ఏళ్ల పాలనలో మహబూబ్‌నగర్ జిల్లా అంటేనే ఒకలా చూసేవారని, 14 రోజులకో మారు తాగునీళ్లు, 3 గంటల కరెంట్ అందే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నందున మరో 15 ఏళ్ల మనమే అధికారంలో ఉండాల్సిన అవసరం ఉందని, అదే జరిగితే ప్రపంచ పటంలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం దక్కుతుందన్నారు. మత కల్లోలాతో చిచ్చుపెట్టిన కాంగ్రెసోళ్ల మళ్లీ అధికారంలోకి వస్తే రూ.200 పింఛన్, 3 గంటల కరెంట్ తీసుకువస్తారని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ దయ వల్లే పాలమూరు సస్యశ్యామలంగా మారిందని, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే మరింత అభివృద్ధి సాధిస్తామన్నారు.

రేవంత్‌పై ఘాటు విమర్శలు

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై మంత్రి కేటీఆర్ ఘాటు విమర్శలు చేశారు. ఓటుకు నోటు కేసులో దొరికినాయనకు నోరు ఎక్కువని.. జడ్చర్లకు ఎప్పుడు వచ్చినా స్థానిక ఎమ్మెల్యే లక్ష్మన్నను తిట్టిపోతాడని, ఆయన తిట్టిన మొదటిసారి 45 వేల మెజార్టీని ప్రజలు అందించారని, ఇటీవల మరోసారి తిట్టినందుకు ఈసారి 90 వేల మెజార్టీతో లక్ష్మన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు.



జడ్చర్లలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

గణనీయమైన ప్రగతి..

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని తెలంగాణ రాష్ట్రానికి ముందు.. తర్వాత అని చెప్పుకోవాలని అన్నారు. అన్ని రంగాల్లోనూ గణనీయమైన ప్రగతి సాధించామని, అభివృద్ధి చేయకుంటే ఎన్నికల బరిలో నుంచి తప్పుకొంటానంటూ తాను విసిరిన సవాల్‌ను ఎవరూ స్వీకరించలేదంటే తాను చేసిన అభివృద్ధిని గుర్తించినట్లే కదన్నారు. అసెంబ్లీ పరిధిలో మొత్తం 2 వేల ఇళ్లు నిర్మించామని, ఇళ్ల కేటాయింపు నిజమైన నిరుపేదలను అర్హులుగా గుర్తించి పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. గృహలక్ష్మి పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 4 వేల ఇళ్లు మంజూరు చేస్తామని సీఎం ప్రకటించారన్నారు. రాష్ట్రం బాగుచేయాలని ముఖ్యమంత్రికి, నియోజకవర్గం బాగుచేయాలని ఎమ్మెల్యేకు ఉంటే ఎంతో ప్రగతి సాధించవచ్చని నిరూపించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్, కలెక్టర్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి రాకతో మారిన స్వరూపం

- చెరువుల వద్ద నీటిశుద్ధి వ్యవస్థ ఏర్పాటు చేస్తాం
- చెరువుల పండగలో మంత్రి నిరంజన్‌రెడ్డి



నల్ల చెరువుకట్టపైకి మహిళలతో కలిసి వస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

వనపర్తి టౌన్: సాగునీటి రాక జిల్లా.. రాష్ట్ర స్వరూపాన్నే మార్చేసిందని, కన్నెత్తి చూడలేని స్థితిలో ఉన్న చెరువులను కనుల పండువుగా మార్చామని, మరింత మార్చబోతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. చెరువుల పండగలో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని నల్ల చెరువు, తాళ్ల చెరువు, అమ్మ చెరువు, మర్రికుంట చెరువులపై నిర్వహించిన సభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలను అధిగమించి, 9 ఏళ్లలోనే తెలంగాణ పురోగమించిందన్నారు. చెరువుల వద్ద శుద్ధమైన నీరు నిల్వ ఉండేలా నీటి శుద్ధి వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కృష్ణ నీళ్లతో నల్ల చెరువును నింపామని, అన్యాక్రాంతం అవుతున్న అమ్మ చెరువు, తాళ్ల చెరువు, మర్రికుంట చెరువును ఆధునికీకరించామన్నారు. సమైక్య పాలనలో నీటి కోసం పడిన దుఃఖం మళ్లీరానివ్వమన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ.. చెరువులంటేనే జీవితమన్నారు. బిజీ లైఫ్‌లో చెరువుల సుందరీకరణ ప్రజలకు ఉపశమనం కల్గిస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎస్పీ రక్షిత కె. మూర్తి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ వాకిటి శ్రీధర్, కమిషనర్ విక్రమసింహారెడ్డి పాల్గొన్నారు.

విద్యుద్దీపాలతో చెరువుకట్టలు మిరుమిట్లు

జిల్లా కేంద్రంలో చేపట్టిన చెరువుల పండుగ జాతరను తలపించింది. నల్లా చెరువు, తాళ్ల చెరువు, అమ్మచెరువు, మర్రికుంట చెరువులు రూఫ్‌లైట్లు, విద్యుత్‌కాంతులతో జిగేల్ అనిపించాయి. మృగశిక కార్తె ప్రారంభం కావడంతో ప్రజలకు ఆయా సమీప చెరువుకట్టల కాలనీవాసులకు విందుభోజనం ఏర్పాటు చేయడంతో ప్రజలు సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు మెప్మా ఆధ్వర్యంలో బతుకమ్మలను పేర్చి ఆటపాటలాడారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మత్స్యకారుల జీవనోపాధి మెరుగు

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం నీటి వనరులు కల్పించి మత్స్యశాఖ ద్వారా ఉచిత చేపపిల్లలు అందించి మత్స్యకారుల జీవనోపాధికి మార్గం సుగమం చేసిందని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన వనపర్తి బాలకిష్టయ్య మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మత్స్య ఉత్పత్తుల మేళా కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో తొలి మత్స్యకళాశాలను పెబ్బేరులో ఏర్పాటు చేసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఏడాది పొడవునా మత్స్యకారులకు ఉపాధి కలిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

గోపాల్‌పేట: ఏదుట్లలో జరిగి చెరువుల పండుగలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాకతీయుల కాలంనాటి గొలుసుకట్టు చెరువులకు ప్రాధాన్యత ఇచ్చి మరమ్మతులు చేయించడంతో పంటలకు సాగునీరు, మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. సర్పంచు శ్రీలత, ఉపసర్పంచు క్రాంతిరావు, సీపీఓ వెంకటరమణ, డీఐఈఓ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువతి మృతి

మహమ్మదాబాద్: తీవ్రమైన కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి చికిత్స పొందుతూ మృతి చెంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన బోయమోని శ్రీను కుమార్తె హరిత (16) కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుంది. ఇదేతరుణంలో బుధవారం కూడా కడుపు నొప్పి భరంచలేక ఇంటి పక్కనే గల బాత్‌రూంలో ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు ఆమెను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కూలీ పనికి వెళ్లి వస్తుండగా..


అనంతమ్మ (ఫైల్)

కోయిల్‌కొండ: మండలంలోని మల్కాపూర్‌కు చెందిన అనంతమ్మ (38) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందింది. గత సోమవారం అనంతమ్మ, ఆమె భర్త వడ్డె పెద్దరాజు (46) కలిసి కూలీ పనికి మహబూబ్‌నగర్‌కు వెళ్లిం తిరిగి గ్రామానికి బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో అభంగపట్నం నుంచి వస్తున్న కుమారస్వామి బైక్ మార్గమధ్యం భవానీసాగర్ సమీపంలో ఢీకొనడంతో పెద్దరాజుతో పాటు కుమారస్వామి అక్కడికక్కడే మృతిచెందారు. అనంతమ్మకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. అనంతమ్మకు నలుగురు కుమార్తెలు ఉండగా.. ఒక కుమార్తె వివాహమైంది. మిగిలిన ముగ్గురు కుమార్తెలు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం


రాజ్‌కుమార్ (ఫైల్)

మక్తల్: ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పర్వతాలు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం తుమ్మలచెర్వుకు చెందిన వడ్డే రాజ్‌కుమార్(27) కొంత కాలంగా భార్య సంధ్యతో పాటు మక్తల్‌లో నివాసం ఉంటున్నాడు. ఇక్కడే ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల ఏరువాక పౌర్ణమి సందర్భంగా దంపతులు తుమ్మలచెర్వుకు వెళ్లారు. 5వ తేదీన రాజ్‌కుమార్ ఒక్కడే పట్టణానికి వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం ఆయనకు భార్య ఫోన్ చేస్తే ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి పక్కింటి వారికి సమాచారం ఇచ్చింది. వారు ఇంటి తలుపులు తెరిచి చూడగా ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మాగనూర్: మండల కేంద్రానికి చెందిన అనిల్‌కుమార్(48) వ్యక్తిగత కారణాలతో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ విషయంపై స్థానిక ఎస్‌ఐ నరేందర్‌ను వివరణ కోరగా.. ఆత్మహత్యపై తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు. మృతుడికి గతంలోనే భార్య చనిపోగా ఇద్దరు చిన్నారి కూతుళ్లు ఉన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



అయిజ: పట్టణంలో భరత్‌నగర్‌లో ఇంట్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి చోరీ చేశారు. ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన హరిప్రసాద్ మండలంలోని ఉప్పల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అయితే ఈయన ఆదివారం బంధువుల పెళ్లికి కుటుంబసభ్యులతో కలిసి గద్వాలకు వెళ్లాడు. బుధవారం రాత్రి ఆయన ఒక్కడు పట్టణానికి వచ్చి స్నేహితుడి ఇంట్లో నిద్రపోయాడు. అదేరోజు రాత్రి ఆయన ఇంట్లో దొంగలు చొరబడి బీరువా తలుపులు విరగొట్టారు. మొత్తం రూ.2 లక్షల విలువచేసే బంగారం, నగదును అపహరించారు. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న హరిప్రసాద్ చోరీ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేశారు.

మన పిల్లలకు కొలువులు రావాలె

- నైపుణ్యం ఉంటే ఎక్కడైనా బతకొచ్చు
- ఐటీ అంటేనే తెలంగాణ రాష్ట్రం
- రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ


స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమిపూజలో భాగంగా సిమెంట్ వేస్తున్న మంత్రి కేటీఆర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మన పిల్లలకు స్థానికంగానే కొలువులు రావాలనే ఉద్దేశంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద మహిళా ఐటీఐ కళాశాల ఆవరణలో సెయింట్ ఫౌండేషన్, శాంతానారాయణగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి కేటీఆర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నైపుణ్యం ఉంటేనే ఏమైనా సాధించవచ్చని, స్కిల్స్ ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా జీవించవచ్చన్నారు. డబ్బులు ఉంటేనే సరిపోదని మంచి పని చేయాలనే మనస్సు ఉండాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని, ఉపాధి అవకాశాలు అంతేలా ఉంటాయని, అందరూ స్కిల్ సంపాదించాలని సూచించారు. మహిళా ఐటీఐని బాగు చేసేందుకు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించిన సెయింట్ ఫౌండేషన్ అధినేత బీవీఆర్ మోహన్‌రెడ్డిని మంత్రి అభినందించారు.

- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ఐటీ అంటేనే తెలంగాణ అనే విధంగా ఐటీని కేటీఆర్ అభివృద్ధి చేస్తున్నారన్నారు. నేను పాలు అమ్మినా అంటూ మరోసారి మల్లారెడ్డి నవ్వులు పూయించాయి. ఇప్పుడు మిమ్మల్ని పాలు అమ్మమని చెప్పను కానీ, టెక్నాలజీని నమ్ముకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు.

మంత్రి పాదాభివందనం..

సెయింట్ ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ బీవీఆర్ మోహన్‌రెడ్డికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమావేశ వేదికపైనే పాదాభివందనం చేశారు. పేదల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మంత్రి అయి ఉండి ఏమాత్రం బేషిజాలు లేకుండా గొప్ప పనిచేస్తున్న మోహన్‌రెడ్డికి శ్రీనివాస్‌గౌడ్ పాదాభివందనం చేయడం ఎంతో గొప్ప విషయమని మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. అనంతరం సెయింట్ ఫౌండేషన్, శాంతానారాయణగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవంతోపాటు.. వారిని వివిధ ఉద్యోగాల్లో నియమిస్తూ ఆఫర్ లెటర్లను మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, బీవీఆర్ మోహన్‌రెడ్డి చేతులమీదుగా అందచేశారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ కె.నరసింహ, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, గువ్వల బాలరాజు, అబ్రహం, సెయింట్ ఎండీ కృష్ణారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు ఆంజనేయులు, వాల్యానాయక్, ఇంతియాజ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, రైతుబంధు సమితి జిల్లా చైర్మన్ గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

సాగునీరు, పరిశ్రమలతోనే అభివృద్ధి


పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల, గువ్వల

అడ్డాకుల: సాగునీరు, పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. గురువారం మూసాపేట మండలం వేముల సమీపంలో ఉన్న ఎస్‌జీడీ ఫార్మా వద్ద రూ.500 కోట్లతో కొత్తగా నిర్మించనున్న కార్నింగ్ టెక్నాలజీ ప్లాంట్‌కు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. రెండువేల మందికి ఉపాధి కల్పించేందుకు పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న ఎస్‌జీడీ ఫార్మా అధినేత ఎక్బాల్‌సింగ్, ఎండి అక్షయ్‌సింగ్‌ను అభినందించారు. కొత్తకోట, దేవరకద్రలో ప్రభుత్వ ఆస్పత్రులను నిర్మిస్తామన్నారు. నియోజకవర్గాన్ని మహబూబ్‌నగర్, జడ్చర్ల కంటే ఎక్కువగా ఎమ్మెల్యే ఆల అభివృద్ధి చేస్తున్నారని అభినందించారు. మంత్రి మాల్లారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్‌కు ఓట్లేస్తే మురుగు కాల్వల్లో వేసినట్లేనన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యుత్, నీరు, శాంతిభద్రతలు బాగున్నందుకే రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసాపేట వద్ద ఉన్న 150 ఎకరాల భూమిలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి కొన్ని కంపెనీలు స్థలాన్ని చూసినట్లు వివరించారు. దేవరకద్రను పురపాలికగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నర్సింహ, శాట్ చైర్మన్ ఆంజనేయగౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, ఎంపీపీ కళావతి, సర్పంచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్..

భూత్పూర్: పట్టణంలోని ట్యాంక్‌బండ్ వద్ద గురువారం మంత్రి కేటీఆర్ ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. జిల్లా పర్యటనలో భాగంగా మహబూబ్‌నగర్ నుంచి మూసాపేటకు వెళ్తూ మార్గమధ్యంలో భూత్పూర్‌కు వచ్చారు. 10.21 గంటలకు భూత్పూర్‌కు చేరుకున్న మంత్రి ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి 10.32 గంటలకు వెళ్లిపోయారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, నాయకులు నారాయణగౌడ్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ప్రజాప్రతినిధులు

మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న బీజేపీ నాయకులు

జడ్చర్ల టౌన్: పుర పరిధిలోని ఎర్రగుట్టవద్ద రెండు పడక గదుల ఇళ్ల ప్రారంభోత్సవానికి గురువారం వచ్చిన రాష్ట్ర పురపాలక, ఐటిశాఖ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ని నేతాజీ చౌరస్తాలో బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. ఏడుగురు బీజేపీ నాయకులు నినాదాలు చేస్తూ ఒక్కసారిగా మూసా కాంపౌండ్ వీధిలో నుంచి రహదారిపైకి రావటంతో కాన్వాయ్‌ని నిలిపివేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


బీజేపీ నాయకులు అడ్డుకోవడంతో నిలిచిన కేటీఆర్ కాన్వాయ్

పైప్‌లైన్ పనులు అడ్డుకున్న అటవీ అధికారులు


అటవీ శాఖ వారితో మాట్లాడుతున్న రైతులు

- మరోసారి వివాదాస్పదంగా మారిన 83 సర్వే నంబర్

లింగాల: మండలంలో పోడు భూముల సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. మండలంలోని క్యాంపు రాయవరం శివారులో ఉన్న సర్వే నంబర్ 83లో ఉన్న భూమిలో గురువారం రైతులు అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ పనులు చేస్తుండగా, సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ వారు, ఘటనా స్థలానికి చేరుకొని పనులను నిలిపివేశారు. దీనిపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. తాము పూర్వకాలం నుంచి సర్వే నంబర్ 83లో 1300లకు పైగా ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని రైతులు తెలిపారు. ఈ భూమిపై పట్టాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్నా అటు రెవెన్యూ, ఇటు అటవీ శాఖ వారు స్పందించకపోవడంతో ఏటా అటవీ శాఖ వారు సమస్య పెంచుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తాము సాగు చేసుకుంటున్న భూములను జాయింట్ సేర్వే చేయించాలని అర్జీలు పెట్టుకున్నా ఆయాశాఖల వారు స్పందించడం లేదని రైతులు తెలిపారు. తాము పొలాలకు సాగు నీటిని చీకటి చెర్వు వాగు ద్వారా పైపులను వేసుకొని తీసుకుంటున్నామని, గతంలో భూమిపై పైపులు వేసి సాగునీటిని పొందుతున్నామని రైతులు తెలిపారు. తమ భూమిలో అండర్‌గ్రౌండ్ ద్వారా పైపులు వేసుకుంటుంటే అభ్యంతరం తెలుపడం సరైందికాదని రైతులు అంటున్నారు.

ముమ్మాటికీ ఇది రెవెన్యూ భూమే..

తాము తాత ముత్తాతల కాలం నుంచి రెవెన్యూ భూమిని సాగు చేసుకొని జీవిస్తున్నామని, కాని నేడు అటవీశాఖ అట్టి భూమి తమదేనని వాదించడం, తరచుగా రైతులను ఇబ్బందులను గురి చేయడం తగదన్నారు. రెవెన్యూ రికార్డులలో కూడా స్పష్టంగా ఉందని, కాని అటవీ శాఖ ఎలాంటి ఆధారాలు చూపకుండా అడ్డుతగలడం సరికాదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు శాశ్వత పరిష్కారం చూపాలని, రెవెన్యూ పట్టాలను ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

అనుమతులు తెచ్చుకోవాలని..

సర్వే నెంబర్ 83లో ఉన్న భూమిని సాగు చేసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, గతంలో మాదిరిగా పైపు లైన్లను భూమిపై భాగం నుంచి వేసుకోవాలని సూచించారు. భూమిలోపల పైపు లైన్ పనులు చేయాలను కుంటే డీఎఫ్‌ఓ దగ్గర అనుమతులు తీసుకోవాలని అటవీ శాఖ డీఆర్‌ఓ జయదేవ్ రైతులకు సూచించారు.

తెలంగాణ చెంచుల్లో రక్తహీనత అధికం

- ఎన్‌ఐఎన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రావ్


అప్పాపూర్‌లోని చెంచులకు మగువ లడ్డూలు పంపిణీ చేస్తున్న అధికారులు

మన్ననూర్: తెలంగాణలోని చెంచుల్లో రక్తహీనత అధికంగా ఉన్నట్లు పలు ఫుడ్ సర్వే సంస్థల పరిశోధనల్లో తేటతెల్లం అయ్యిందని జాతీయ పోషక ఆహార పరిశోధన సంస్థ (ఎన్‌ఐఎన్) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రావ్ అన్నారు. గురువారం బృందం సభ్యులతో కలిసి అటవీ లోతట్టు ప్రాంతాలైన అప్పాపూర్, భౌరాపూర్ చెంచుపెంటలను సందర్శించిన ఆయన, మన్ననూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 4–5 రిపోర్టుల ప్రకారం రాష్ట్రంలోని మిగతా జనాభాతో పోల్చుకుని చూస్తే చెంచుల్లో పోషకాహార లోపం అధికంగా ఉన్నట్లు తేలిందన్నారు. చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని అన్నారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్, అదిలాబాద్, భద్రాద్రీ కొత్తగూడెం, ఆసీఫాబాద్ జిల్లాలతో పాటూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని మారుమూల ప్రాంత చెంచు పెంటలైన అప్పాపూర్, భౌరాపూర్ రెండు పెంటల పెంటలు గ్రామాల చొప్పున ఎంపిక చేసి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ దత్తత తీసుకున్న సంగతి విధితమే అన్నారు. ఈ క్రమంలో ఆయా రెండు చెంచు పెంటలు, గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని వారికి అవసరమైన పౌష్టిక ఆహార పదార్థాలతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి పోషక విలువలు, విటమిన్స్ అధికంగా కలిగిన ఇప్పపువ్వుతో తయారు చేసిన మగువ లడ్డూలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మన్ననూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అస్వస్థతగా ఉన్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. మరికొన్ని రోజుల్లో రక్త హీనత సమస్యను అధిగమించి ఆరోగ్యవంతమైన తెలంగాణను ఆవిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఐఎన్ బృందం సభ్యులు, కృష్ణారావ్, హరిలాల్, రాజేష్, హన్మంతు పాల్గొన్నారు.

డబ్బాలోకి దూసుకుపోయిన కారు



మన్ననూర్‌లో డబ్బాలలోకి దూసుకుపోయిన కారు

మన్ననూర్: మద్దిమడుగు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న రెండు డబ్బాలలోకి (షాపులు) కారు దూసుకుపోయింది. ఈ సంఘటన గురువారం మన్ననూర్‌లో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు... హైదరాబాద్‌కు చెందిన నలుగురు యువకులు టాటా సఫారీ (ఏపీ 28 ఏఆర్ 3699) కారులో అమ్రాబాద్ మద్దిమడుగు వైపు నుంచి అచ్చంపేట వైపు వేగంగా వచ్చారు. ఐటీడీఏ వద్ద ఎదురుగా వస్తున్న వారిని తప్పించేక్రమంలో రోడ్డు పక్కన ఉన్న ఫొటో స్టూడియో డబ్బా(దుకాణం), మరో డబ్బాను ఢీకొట్టారు. ఈ సమయంలో డ్రైవర్ తోపాటు నలుగురూ మద్యం మత్తులో ఉన్నారు. ఈ సంఘటనతో రెండు డబ్బాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాల వారిని అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌కు రప్పించి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిసింది.

పంట మార్చితేనే నేలకు బలం


పత్తి పంట

- భూసార వృద్ధి జరుగుతుంది
- రోగకారక పురుగుల జీవిత చక్రం ఛేధన
- చీడపీడల అభివృద్ధికి అడ్డుకట్ట

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): పంట మార్పిడి.. ఒకసారి వేసిన పంటను అదే పొలంలో మరలా వెంటనే వేయకుండా మధ్యలో వేరొక పంటను వేయడాన్ని పంట మార్పిడి అంటారు. రైతులు ఎల్లప్పుడు ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల వాటిపై రోగాలను కలిగించే పురుగుల సంఖ్య బాగా పెరిగి దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఒకే రకమైన పంటలను మొక్కలు భూమిలోని ఒకే లోతు పొరల నుంచి పోషకాలను స్వీకరిస్తాయి. కావునా పోషకాలు తగ్గి మొక్కల ఎదుగుదల కూడా సక్రమంగా ఉండదు. అందుకే ఒకే రకమైన పంటను వరుసగా సాగు చేయకుండా పంట మార్చడం ద్వారానే ఫలితం చేకూరుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

పంట మార్పిడి ప్రాధాన్యం..

- ఒక పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతి అధికం కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి
- పురుగు జీవితచక్రం నిరాటంకంగా ముగించుకుని తీవ్రమైన హాని కలిగించే స్థితికి చేరుకుంటుంది.
- పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవిత చక్రం చేధించబడుతుంది. ఎందుకంటే ఒక పంటపై ఆశించే పురుగులు మరొక పంటపై ఆశించడం సాధారణంగా జరుగదు.
- వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంట మార్పిడి వల్ల అదుపులో పెట్టవచ్చు.
- ఒకే లోతు వ్యవస్థ కలిగిన పంటలను ఉదాహరణకు పత్తి, మిరప మొదలైన వాణిజ్య పంటలను మార్పిడి చేయకుండా సాగు చేయడం వల్ల ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమవుతుంది.
- వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న వంటి పైర్లు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి.
- నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతినకుండా ఉండటానికి, చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంట మార్పిడి తప్పక చేయాలి.
- అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పశుగ్రాసం కొరకు గడ్డిజాతి పైర్లు భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవచ్చు.

ప్రయోజనాలు

- వరి తర్వాత మినుము, పెసర, శనగ వేయడం వల్ల సుడిదోమ, టుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.
- చెరుకు తర్వాత వరిని సాగు చేయడం వల్ల వేరు పురుగును, దోమపోటు నివారించవచ్చు.
- జొన్న, మొక్కజొన్న తర్వాత కందిని సాగు చేస్తే కాయ తొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.
- వరిని సాగు చేసే పొలాల్లో ముందుగా పప్పుధాన్యాలను సాగు చేయడం వల్ల నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకు ముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లతో మార్పిడి చేయాలి.
- కంది, మిరప పంటల్లో ఎండుతెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి.
- నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, మిరప పైర్ల సాగును కొన్ని పంట కాలాల వరకు ఆపాలి.
- ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పైర్లను పప్పుజాతి పైర్లయిన పెసర, మినుము, వేరుశనగ పంటలతో మార్పిడి చేయాలి.
- ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో ఒకసారి, పప్పుజాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం లాభదాయకం.

పంట మార్పుతో తెగుళ్లకు అడ్డుకట్ట..



రైతులు ఎల్లప్పుడూ ఒకే రకమైన పంట సాగు చేయడం వల్ల ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువై దిగుబడి తగ్గుతుంది. తెగుళ్ల ఉధృతి పెరుగుతుంది. అందుకే రైతులు వరుసగా ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి చేస్తుండాలి. తద్వారా దిగుబడులు పెరిగి లాభాలను పొందవచ్చు.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ప్రేమపేరుతో వంచించిన యువకుడిపై కేసు

బల్మూర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి వాంఛ తీర్చుకున్న అనంతరం మోసం చేసిన యువకుడిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు... మండలంలోని కొండనాగులకు చెందిన తవిటి శ్రీకాంత్, ప్రేమిస్తునని, పెళ్లి చేసుకుంటానని రెండేళ్లుగా ఓ యువతిని నమ్మించాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని కోరడంతో నీకు నాకు సంబంధం లేదని నిరాకరించి, బెదిరించడంతో బాధితురాలు ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో ఉపాధ్యాయుడికి జైలుశిక్ష

గద్వాల క్రైం: వరకట్న వేధింపుల కేసులో ఓ ఉపాధ్యాయుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. గురువారం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌నాయక్ ఈ తీర్పును వెల్లడించారని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెచ్చల్ సంజన జాషువ తెలిపారు. గద్వాల పట్టణానికి చెందిన ప్రభుత్వ టీచర్ ఉషారాణికి రంగారెడ్డి జిల్లా నాచారానికి చెందిన బత్తుల శరత్‌కుమార్ గౌడ్ (ఉపాధ్యాయుడు)తో 2006లో పెద్దలు వివాహం జరిపించారు. రూ.8లక్షలు, 20తులాల బంగారు, వస్తుసామాగ్రిని కట్నంగా ఇచ్చారు. కొన్నినెలల తర్వత భర్త, వారి కుటుంబ సభ్యులు మరో రూ.5లక్షల అదనపు కట్నం లేదా రెండు ఎకరాల వ్యవసాయ భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హత్య చేస్తామని బెదిరింపులకు గురి చేశారు. దీంతో 2010లో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఉషారాణి ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీంతో గురువారం కోర్టులో సాక్షుల వాంగ్మూలం, పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం జడ్జి తీర్పును వెల్లడించారని పేర్కొన్నారు.

మౌంటేనీరింగ్ శిబిరానికి వనపర్తి విద్యార్థి


అజయ్‌ని బొకేతో అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వనపర్తిటౌన్: ఈనెల 10వ తేదీ నుండి 22వరకు ఉత్తరఖండ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి అడ్వాన్స్‌డ్ మౌంటేనిరింగ్ శిబిరానికి వనపర్తి డిగ్రీ మెన్స్ (కో–ఎడ్) కళాశాల విద్యార్థి ఎల్.అజయ్ ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. 8వ తెలంగాణ బెటాలియన్ అధికారుల ఎన్‌సీసీ శిక్షణలో భాగంగా ఎంపిక చేయగా, తదుపది ఎంపికలో అడ్వాన్స్ మౌంటేనిరింగ్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న అజయ్‌ను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు బొకేతో అభినందించారు. ఎన్‌సీసీలో భాగంగా ఇలాంటి జాతీయ శిబిరానికి ఎంపికైతే దేశభక్తి, ధైర్యసాహసాలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరింత పెరుగుతాయన్నారు. అధ్యాపకులు కె. రమేష్, సురేందర్‌రెడ్డి, రామ ఓబులేసు, ధామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


జమాల్ (ఫైల్)


పాషా (ఫైల్)

తండ్రి చనిపోతాడని.. కొడుకు ఆత్మహత్యాయత్నం

గూడూరు: ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్న తండ్రి చనిపోతున్నాడని తెలుసుకు న్న కొడుకు.. ఆవేదనతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని చెంద్రుగూడెంలో గురువారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చెందుగూడానికి చెందిన మహ్మద్ జమాల్ (55)కు ఇద్దరు కుమారులు. పె ద్ద కొడుక్కి పెళ్లి కాగా, చిన్న కొడుకు మ హబూబ్ పాషా ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) చదువుతున్నాడు. నెల రోజులుగా తండ్రి జమాల్ అనారోగ్యంతో బాధపడుతున్నా డు. అతనికి క్యాన్సర్ అని వైద్యులు చెప్పడంతో 15 రోజుల క్రితం హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రో జుల క్రితం తండ్రి జమాల్ పరిస్థితి విషమించిందని, కొద్దిరోజుల్లో చనిపోతాడని వైద్యులు చెప్పారు. దీంతో మహబూబ్‌పాషా గురువారం స్వగ్రా మానికి చేరుకుని పురుగు మందు తాగి, బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ప్రథమ చికిత్స తర్వాత పాషాను వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మహబూబ్‌పాషా తండ్రి జమాల్ మధ్యాహ్నం 12 గంటలకు ఆస్పత్రిలో చనిపోయాడు. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న మహబూబ్ పాషా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు బంధువులు తెలిపారు.

వేములవాడ రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్లు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్నకు 15 రోజుల్లోనే రూ.2 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. గురువారం ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్థానిక ఓపెన్‌స్లాబ్‌లో హుండీలలోని నగదు లెక్కించారు. రూ.2 కోట్ల నగదు, 211 గ్రాముల బంగారం, 17,500 కిలోల వెండి సమకూరినట్లు ఈవో వెల్లడించారు. హుండీ లెక్కింపులో ఏఈవోలు ప్రతాప నవీన్, జయకుమారి, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొక్కు'బడి బాట'..!

ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల చేరికకు నామమాత్ర స్పందన

- స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించట్లేదంటున్న టీచర్లు
- ఉపాధ్యాయులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని భావిస్తున్న అధికారులు
- కొన్నిచోట్ల బడిబాటకు వెళ్లకుండానే వెళ్లినట్లుగా రికార్డులు!
- బడి మానేసిన వారిని 66 వేల మందిని గుర్తించినా చేరికలపై అస్పష్టత
- ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని మరీ ప్రైవేటు స్కూళ్ల జోరు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖ చేపట్టిన 'బడిబాట'కు స్పందన నామమాత్రంగానే ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఇందుకు సహకరించట్లేదని ఉపాధ్యాయ వర్గాలు అంటుండగా..టీచర్ల నిర్లిప్తత ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రైవేటు స్కూళ్లు ఆకర్షించినట్టుగా విద్యార్థులను ప్రభుత్వ టీచర్లు ఆకర్షించడం లేదని ఉన్నతాధికారులు సైతం భావిస్తున్నట్టు సమాచారం. కాగా చాలాచోట్ల బడిబాట కార్యక్రమానికి వెళ్లేందుకు టీచర్లు మొగ్గుచూపడం లేదని తెలుస్తోంది. రికార్డుల్లో వెళ్లినట్టుగా చూపిస్తూ, ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు పంపుతున్నారు. దీంతో కార్యక్రమం మొక్కుబడిగా మారింది. డీఈవోలు, ఎంఈవోల కొరతతో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

బడి మానేసినవారు తిరిగి చేరేలా..

బడి మానేసిన వారిని బడికి తిరిగి రప్పించడమే కాకుండా, ప్రభుత్వ స్కూళ్లలోకి విద్యార్థులను మరలించేందుకు విద్యాశాఖ ఈ నెల 3 నుంచి 'బడి బాట'చేపట్టింది. ప్రతి స్కూల్ పరిధిలో టీచర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలు బడిలో చేరేలా చూడాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

గుర్తించింది 66 వేలు..

ఏటా ప్రభుత్వ స్కూళ్లలో 2 లక్షల మందిని కొత్తగా చేర్పిస్తున్నామని విద్యాశాఖ చెబుతోంది. కానీ ఇప్పటివరకు బడిలో చేర్పించాల్సిన విద్యార్థులు 66,847 మందిని మాత్రమే గుర్తించినట్టు విద్యాశాఖ వెల్లడించింది. వీరిలో ఒకటవ తరగతిలో చేర్చాల్సిన వారి సంఖ్య 16,038 ఉంది. ఇందులో 12,120 మందిని అంగన్‌వాడీల్లో చేర్పించేందుకు పేర్లు నమోదు చేశారు. ప్రైవేటు స్కూళ్లలో చేరేందుకు 1,181 మంది మొగ్గుచూపారు. ఇక 2,737 మంది బడిబాట బృందాలతో సంబంధం లేకుండానే స్కూళ్లలో చేరేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు 2–7 తరగతుల మధ్య బడి మానేసిన పిల్లలు 8,966 మందిని కూడా గుర్తించారు. వీళ్లు ఇప్పటివరకు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఎక్కడ చేరారన్నది స్పష్టత ఇవ్వలేదు.



రాజధాని పరిసరాల్లోనే ఎక్కువ

బడి మానేస్తున్న వారిలో గ్రామీణ ప్రాంతాలకన్నా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఎక్కువమంది ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 4,137 మందిని గుర్తించారు. హైదరాబాద్‌లో 2,376 మంది బడి మానేసినట్టు తెలుసుకున్నారు. మెదక్‌లో 2,254 మంది, మేడ్చల్‌లో 1,457 మంది బడికి దూరమైనట్టు గుర్తించారు. ఇక ఖమ్మం జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో 3,371 మంది, నిజామాబాద్‌లో 4,107 మంది బడి మానేసిన పిల్లలున్నారు. హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో స్కూళ్లకెళ్లని విద్యార్థుల తల్లిదండ్రులంతా దినసరి కూలీలే కావడం గమనార్హం. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినవారు పిల్లలను కూడా రోజువారీ పనులకు పంపుతున్నట్టు తేలింది. వీళ్లను గుర్తించడమే తప్ప, వీరంతా స్కూళ్లలో చేరతారా? లేదా? అనేది మాత్రం స్పష్టం కావట్లేదు.

ప్రైవేటు టీచర్లకు టార్గెట్లు

ప్రైవేటు స్కూళ్లు విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించడమే లక్ష్యంగా ఏజెంట్లను రంగంలోకి దింపుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో చదివే వారికీ గాలమేస్తున్నాయి. గ్రామాల్లో కొంతమందికి కమీషన్లు ఇస్తూ పిల్లల్ని తమ స్కూళ్లలో చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించాలని కోరుతున్నాయి. ఊరూరా ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తున్నాయి. టీచర్లకు టార్గెట్లు విధించి మరీ విద్యార్థులను చేర్చేలా ఒత్తిడి చేస్తున్నాయి. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల లెక్కల ప్రకారం ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్రం మొత్తమ్మీద లక్షమంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటు స్కూళ్లలో చేరినట్టు తెలుస్తోంది.

వర్క్ వీసా పేరుతో మోసం

- మలేషియాలో చిక్కుకున్న 19మంది తెలంగాణ, ఏపీ వాసులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబ సభ్యులు


మలేషియాలో చిక్కుకున్న బాధితులు (ఫైల్)

ఎర్రుపాలెం: విదేశాల్లో మంచి ఉపాధి కల్పిస్తామని, మెరుగైన వేతనం లభిస్తుందని బ్రోకర్లు చెప్పిన మాయమాటలు నమ్మి తెలంగాణ, ఏపీలకు చెందిన పలువురు మోసపోయారు. మోసానికి గురైన బాధితులు మలేషియాలో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. దీనిపై బాధిత వ్యక్తుల కుటుంబసభ్యులు గురువారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, నారాయణపురం, జమలాపురం, అయ్యవారిగూడెం గ్రామాలతో పాటుగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి పట్టణానికి చెందిన 12 మంది మహిళలు, ఏడుగురు పురుషులు బ్రోకర్ల వలలో చిక్కుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నూజీవీడు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మందపాటి నాగబాబు, హైదరాబాద్‌కు చెందిన పాదిల దాశరథి నాయుడు టూరిస్టు వీసాపై మలేషియాకు పంపించి అక్కడ వర్క్ వీసా వచ్చేలా చూస్తామని, మూడేళ్ల పాటు మెరుగైన వేతనం అందుతుందని నమ్మబలికారు. దీంతో మొత్తం 19 మంది రూ.1.90 లక్షల నుంచి 2.75 లక్షల వరకు నాగబాబుకు చెల్లించారు.

గత ఏడాది డిసెంబర్ 17నుంచి వీరిని విడతల వారీగా మలేషియా పంపించి హోటళ్లు, సంస్థల్లో క్లీనింగ్ పని ఇప్పించారు. కానీ కొన్నాళ్ల తర్వాత వీరి వద్ద వర్క్ వీసా లేకపోవడంతో యజమానులు పనిలో నుంచి తొలగించారు. కాగా, అక్కడి అధికారులు వర్క్‌వీసా లేని వీరికి భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.40 వేల చొప్పున జరిమానా విధించారు. దీంతో బాధితులు తమకు జరిగిన మోసం గురించి కుటుంబీకులకు చెప్పగా ఇక్కడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులకు జరిగిన మోసంపై కేసు నమోదు చేసినట్లు ఎర్రుపాలెం ఎస్సై ఎం.సురేశ్ వెల్లడించారు.

భారీగా నకిలీ విత్తనాల పట్టివేత

వరంగల్‌లో రూ.2.11 కోట్ల విలువైన విత్తనాలు స్వాధీనం


పట్టుబడిన నకిలీ విత్తనాలు, ముఠా సభ్యులతో పోలీసులు

వరంగల్ క్రైం: వరంగల్ కేంద్రంగా నకిలీ విత్తనాల తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న రెండు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన టాస్క్ ఫోర్స్, మడికొండ, ఏనుమాముల పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.11 కోట్ల విలువైన 12 టన్నుల నకిలీ పత్తి విత్తనాలు, ఒక డీసీఎం వ్యాన్, ఒక కారు, రూ.21 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం మీడియాకు తెలిపారు. ఏపీలోని కర్నూల్ జిల్లాకు చెందిన దాసరి శ్రీనివాస్, తాప్తే హన్మంతులు, హైదరాబాద్‌కు చెందిన చేడాం పాండ్, చేడాం వెంకటరమణ, వేముల అరవింద్ రెడ్డి, మంచిర్యాలకు చెందిన కొప్పుల రాజేష్, బోగే సత్యం, షేక్ అన్జద్, వెంకటేష్, పుట్ట రాజేశం, చంద్రపూర్‌కు చెందిన సురేందర్‌రెడ్డి, బల్లార్షకు చెందిన ఏన్గుడే దిలీప్, మహబూబ్‌నగర్‌కు చెందిన చేడాం నాగరాజు, బాపట్లకు చెందిన సుందర్ శెట్టి ఫణిందర్, నాగర్‌కర్నూల్‌కు చెందిన కాల్వ శ్రీధర్ అరెస్టు చేసినట్లు తెలిపారు. శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంప సదాశివ్‌లు పరారీలో ఉన్నారన్నారు. ముఠా సభ్యులు రైతుల నుంచి తక్కువ ధరకు విడిగా విత్తనాలు కొనుగోలు చేసి వాటికి రంగులు అద్ది, ఎలాంటి జెనటిక్ ఫార్మింగ్ చేయకుండా పలు కంపెనీల పేరుతో ప్యాకెట్లు రూపొందించి క్యూఆర్ కోడ్ ముద్రించి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు సీపీ తెలిపారు. గుజరాత్ చెందిన నర్మద సాగర్ కోమార్కెటింగ్, రిషి, శ్రీగణేష్ కంపెనీల పేరుతో నకిలీ విత్తనాలు తయారు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, కృపాకర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో హైదరాబాద్‌కు చెందిన అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్‌ను రౌజ్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ నాగ్‌పాల్ ధర్మాసనం ఈ నెల 1న తీర్పును రిజర్వు చేసిన విషయం విదితమే. కాగా జస్టిస్ నాగ్‌పాల్ గురువారం తీర్పును వెలువరించారు. తెలంగాణ ఎమ్మెల్సీ కవిత పేరును తీర్పును ప్రస్తావించడం గమనార్హం. 'ఈ కేసులో పిళ్లై ప్రధాన నిందితుడిగా ఈడీ ఆరోపిస్తోంది. సౌత్ గ్రూపు తరఫున పలు సమావేశాల్లో పాల్గొన్నారని పేర్కొంది. అడ్వాన్స్ కిక్‌బ్యాక్‌ల చెల్లింపుల్లో సౌత్ గ్రూపు సభ్యుడిగా ప్రమేయం ఉందని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతినిధిగా, ఇండో స్పిరిట్స్‌లో డమ్మీ పార్టనర్‌గా ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కుట్రలో పిళ్లై భాగస్వామ్యంపై మౌఖిక, డాక్యుమెంటరీ ఆధారం ఉందని ఈడీ పేర్కొంది. ఇండోస్పిరిట్స్ రూ.192 కోట్ల లాభాల్లో పిళ్లై రూ.32.86 కోట్లు ఆర్జించారని, పెట్టుబడి ఎమ్మెల్సీ కవిత పెట్టారని, కవిత ప్రతినిధిగా ప్రాపర్టీలు కొనుగోలు చేయడంలో కూడా పిళ్లై ప్రమేయం ఉందని ఈడీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. పిళ్లై 29 సార్లు దర్యాప్తునకు సహకరించారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. అన్యాయంగా పిటిషనర్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. కానీ ఈడీ అధికారులు హైదరాబాద్‌లో పిళ్లై నివాసంపై దాడులు చేసినప్పుడు అతని భార్య, మరికొందరు ఈడీ అధికారులను నియంత్రించారన్న ఆరోపణలున్నాయి. ఇతర నిందితులు సమీర్ మహేంద్రు, విజయ్‌నాయర్, అభిషేక్ బోయినపల్లి, బినోయ్‌బాబు, శరత్ చంద్రారెడ్డి, రాఘవ మాగుంట, మనీష్ సిసోడియా తదితరుల రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు కొట్టివేశాం. మరోవైపు మనీలాండరింగ్ నేరంలో ఇతర నిందితుల కన్నా పిటిషనర్ పాత్ర చాలా తీవ్రమైనదిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అతని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం..'అని జస్టిస్ నాగ్‌పాల్ తీర్పులో స్పష్టం చేశారు.

స్టాఫ్ నర్స్‌కు నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు



ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్టాఫ్‌నర్స్ ఉఫత్ ఉన్నీసా బేగం ఈ నెల 6న ఇంటర్ నేషనల్ నర్స్ డేను పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అవార్డు అందుకుంది. నర్సింగ్ వృత్తిలో విశేష సేవలు అందించినందుకుగాను ది నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ది న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవార్డు అందజేశారు. గురువారం డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, పీహెచ్‌సీ సిబ్బంది స్టాఫ్‌నర్స్ ఉఫత్ ఉన్నీసా బేగంను సన్మానించి అభినందించారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి


హనుమంత్‌రెడ్డి (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రానికి చెందిన స్వాతంత్య్ర సమయయోధుడు హనుమంత్‌రెడ్డి (95) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయా పార్టీల నాయకులు గురువారం ఇటిక్యాలకు చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

జిల్లా కోర్టుకు కేఏ పాల్



మహబూబ్‌నగర్ క్రైం: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ గురువారం జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కోర్టు దగ్గర గడిపారు. 2012లో జరిగిన కేఏ పాల్ సోదరుడి హత్య కేసులో జిల్లా కోర్టుకు హాజరైనట్లు న్యాయవాది గౌరీ శంకర్ తెలిపారు. ఈ కేసు మళ్లీ ఈనెల 27కు వాయిగా పడినట్లు పేర్కొన్నారు.

గ్రేడ్–1 మున్సిపాలిటీగా జడ్చర్ల


జడ్చర్ల పట్టణ వ్యూ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో మరో కీలక అడుగు ముందుకు పడనుంది. గ్రేడ్–2గా ఉన్న మున్సిపాలిటీని గ్రేడ్–1గా మార్చేందుకు రాష్ట్ర పురపాలిక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదం తెలపటంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుట్ట వద్ద డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభానికి విచ్చేసిన మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మున్సిపాలిటిని అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించటంతో ఆయన వెంటనే ఆమోదించారు. ఉత్తర్వులు సైతం విడుదల చేస్తామని ప్రకటించారు. 2012లో బాదేపల్లి మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా రూపాంతరం చెందింది. కోర్టు కేసు వల్ల మధ్య మళ్లీ గ్రామ పంచాయతీగా మారినప్పటికీ 2014 జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావం నుంచి రెండో సారి నగర పంచాయతీగా మారింది. 2018లో సమీప గ్రామాలైన జడ్చర్ల, కావేరమ్మపేట, నాగసాల, బూరెడ్డిపల్లిలను కలిపి జడ్చర్ల మున్సిపాలిటీగా ఆవిష్కృతమైంది. 2021 ఏప్రిల్ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించి పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది.

లక్షకు పైగా జనాభా

2011 జనాభా లెక్కల ప్రకారం మున్సిపాలిటీలో 53వేల జనాభా ఉంది. ఈ కారణంగా మున్సిపాలిటీకి గ్రేడ్–2 కేటాయించారు. వాస్తవానికి లక్షకు పైగా జనాభా నివసిస్తున్నట్లు తెలుస్తుంది. పోలేపల్లి ఫార్మా సెజ్ కారణంగా వేలాదిమంది ఉద్యోగులు పట్టణంలో నివసిస్తున్నారు. వారితోపాటు పిల్లల చదువులు, ఉద్యోగం, వ్యాపార రీత్యా పట్టణంలో రోజు రోజుకు స్థిరపడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. గ్రేడ్– 1గా మారితే నిధులు అధికంగా కేటాయిస్తారని, అధికారులు, సిబ్బంది నియామకాలు పెరుగుతాయని పట్టణవాసులు అంటున్నారు. జనాభా ప్రకారం పట్టణంలో అభివృద్ధి చేసుకునేందుకు వీలవుతుందంటున్నారు.


అప్‌గ్రేడ్ చేస్తే అనేక ప్రయోజనాలు



మున్సిపాలిటీని గ్రేడ్ 1గా అప్‌గ్రేడ్ చేస్తే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 53వేల జనాభాను పరిగణలోకి తీసుకుని గ్రేడ్–2గా ప్రకటించారు. ప్రస్తుతం పట్టణంలో లక్షకు పైగా జనాభా చేరుకుంది. మున్సిపాలిటీలో ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. ఏఈ స్థానంలో డీఈలు వస్తారు. తద్వారా పనుల పర్యవేక్షణ పెరుగుతుంది.

– మహమూద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు



మున్సిపాలిటీని గ్రేడ్–1గా మార్చేందుకు అంగీకరించిన పురపాలిక మంత్రి కేటీఆర్‌కు పట్టణ ప్రజల తరఫున కృతజ్ఞతలు. 2011 జనాభా లెక్కల ప్రకారం 53వేలమంది జనాభాకు అనుగుణంగా నిధుల కేటాయింపులున్నాయి. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఆయన ప్రత్యేక శ్రద్ధతో మంత్రి కేటీఆర్‌కు పరిస్థితులను వివరించారు. తద్వారానే మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేసేందుకు మంత్రి ఆమోదించారు.

– లక్ష్మి, చైర్‌పర్సన్, జడ్చర్ల మున్సిపాలిటీ

ఇసుక టిప్పర్ ఢీ: కూలిన ఆలయం


ఘటన స్థలంలో ఇసుక టిప్పర్

కోయిల్‌కొండ: ఇసుక తరలించే టిప్పర్ ఢీకొని మైసమ్మ ఆలయం కూలిన ఘటన బుధవారం అర్ధరాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని అడవి వెంకటాపూర్ అశోక్‌కు చెందిన టిప్పర్ బుధవారం అర్ధరాత్రి సూరారం వాగు నుంచి ఇసుకను అక్రమంగా మహబూబ్‌నగర్ తరలిస్తున్నారు. మార్గమధ్యంలో మండల కేంద్రం సమీపంలో రోడ్డు పక్కన ఉన్న మైసమ్మ ఆలయం వద్దకు రాగానే టిప్పర్ అదుపు తప్పి ఆలయాన్ని ఢీకొని బోల్తాపడింది. అలాగే ఆలయం కూడా నేలమట్టమైంది. కూలిన ఆలయాన్ని వెంటనే పునః నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్–కోయిల్‌కొండ ప్రధాన రహదారిపై ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బీచుపల్లి ఆలయానికి వెండి చౌకట్లు అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయ గర్భగుడికి గురువారం భక్తుడు వెండి చౌకట్లను అందజేశారు. మండలంలోని బట్లదిన్నెకు చెందిన గజేందర్‌రెడ్డి దంపతులు 23.5 కేజీల వెండితో చేయించిన రూ. 21లక్షల విలువైన వెండి చౌకట్లను ఆలయ ఈఓ ఉమారాణి ఆధ్వర్యంలో గర్భగుడికి ఏర్పాటు చేశారు.


ఆలయ గర్భగుడికి ఏర్పాటు చేసి వెండి చౌకట్లు

గుప్తనిధుల ముఠా గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ.. చిత్రంలో నిందితులు


లభ్యమైన శివలింగం

- అలంపూర్ క్షేత్రం పురాతన ఆలయంలో దొంగిలించిన శివలింగం లభ్యం
- ఫిర్యాదు అందిన ఒక్కరోజులోనే ముఠాను పట్టుకున్న పోలీసులు
- ముఠాసభ్యులంతా ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లావాసులే

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రంలోని అతి పురాతన ఆలయమైన మబ్బుమఠంలో ఇటీవల చోరీకి గురైన శివలింగంతోపాటు గుప్తనిధుల ముఠాను అలంపూర్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు గురువారం ఎస్ఐ మహేందర్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అలంపురం పుణ్యక్షేత్రంలో పాపనాశినికి వెళ్లే మార్గంలో శిథిలావస్థకు చేరిన పురాతన మబ్బుమఠంలో శివలింగం కనిపించలేదు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గురువారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ర్యాలంపాడు సమీపంలో కొంతమంది అనుమానంగా కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో ఈ ఏడాది జనవరిలో మబ్బుమఠం పాత శివాలయంలో శివలింగాన్ని దొంగలించినట్టు అంగీకరించారు. సదరు శివలింగాన్ని ఆత్మకూరులోని కాశీం ఇంట్లో దాచిపెట్టామని చెప్పడంతో అలంపూర్ పోలీసులు శివలింగంతోపాటు దొంగిలించిన కర్నూలు జిల్లాలోని నందికొట్కూరుకు చెందిన దేరంగుల హర్ష, త్రిపాటి శేఖర్, గంగిరెడ్డి హన్మంతు, రామకృష్ణ, నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన కాశీం, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాజులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ తెలిపారు.

విలువైన శివలింగం..

మబ్బుమఠంలోని బ్రహ్మసూత్రం గల ఈ శివలింగం మెరుస్తుండటంతో దుండగులు వారికి పరిచయం ఉన్న హైదరాబాద్‌కు చెందిన మోహన్‌రావుకు సమాచారం ఇచ్చారు. దీంతో అతని సూచన మేరకు శివలింగంపై టార్చి వేసి చూడగా మరింతగా మెరుస్తూ గ్రీన్ ఎమోరాల్డ్‌లో కనిపించడంతో మరకత లింగం అని రూ.కోట్లు విలువ చేస్తుందని భావించారు. అయితే ఈ లింగాన్ని హైదరాబాద్ తరలించేందుకు ప్రయత్నించినా.. సరైన బ్యారం రాకపోవడంతో తమ దగ్గరే ఉంచుకున్నారు. అయితే దేరంగుల హర్ష, త్రిపాటి శేఖర్ ముందుగా గుప్తనిధుల కోసం అన్వేషించి ఆయా స్థలాలను తమ స్నేహితుడైన కాశీంకు చెబుతారు. ఆ తర్వాత అందరూ కలిసి గుప్తనిధుల కోసం వెళ్తుంటారని తెలిసింది.

కలుషిత నీరు సరఫరా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో నెలరోజులగా పైగా మిషన్‌భగీరథ నుంచి వచ్చే నీళ్లు కలుషితమై వస్తున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ప్రతి ఇంటికి నల్లాల ద్వారా శుద్ధ జలం సరఫరా చేస్తున్నామని ఓ వైపు ప్రభుత్వం చెబుతుంటే క్షేత్ర స్థాయిలో మున్సిపల్ శాఖ అధికారులు ఫిల్టర్ కాని నీళ్లను సరఫరా చేస్తున్నారు. మండలంలోని రాంరెడ్డిగూడెం ఫిల్టర్ నుంచి పట్టణానికి మిషన్ భగీరథ నీళ్లను సరఫరా అవుతుంది. ఈ నీళ్లను తాగేందుకు ప్రజలు జంకుతున్నారు. గురువారం కూడా కలుషితనీరు సరఫరా అయ్యాయి. శరీరానికి మేలు చేయడం మాట అటుంచి మిషన్ భగీరథ నీళ్లు తాగితే లేని రోగాలు వచ్చేటట్లు ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారు. రోగాల బారిన పడితే సాధారణ ప్రజలు కాని మేము కాదు కదా అనే భావనలో అధికార యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తుంది.


సుభాష్‌నగర్ ప్రాంతంలో సరఫరా అయిన మిషన్ భగీరథ నీళ్లు